కౌలు రైతులకు 'గుర్తింపు' ఏదీ?

- సొంత భూమి కలిగిన వారికే ఫార్మర్ ఐడీ కార్డులు
- కౌలు రైతులకు దక్కని యూనిక్ ఐడీ రిజిస్ట్రేషన్
- ప్రభుత్వ భూముల సాగుదారులకు మొండిచేయి
- కార్డు లేకుంటే ప్రభుత్వ పథకాలకు అనర్హులు
- గుర్తింపు కార్డులతో కౌలు రైతుల్లో ఆందోళన




మూలపాడులో రైతులకు ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేస్తున్న వీఏఓ సాయికృష్ణ, రైతులు ; జూపూడిలో ఫార్మర్ ఐడీ కార్డుకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

ఇబ్రహీంపట్నం: ప్రతి పౌరుడికి ఆధార్ కార్డుతో గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11 అంకెలు కలిగిన యూనిక్ ఐడీ నంబర్‌తో ఫార్మర్ ఐడీ కార్డు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్డు పొందేందుకు ముందు పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత పీఎం కిసాన్ పొందని సొంత భూమి కలిగిన రైతులకు కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్డుల కేటాయింపులో కౌలు రైతులు, అటవీ, దేవదాయ, లంక వ్యవసాయ భూముల సాగుదారుల మాట ఎక్కడా ప్రస్తావించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు 3,500 మంది రైతులకు రిజిస్ట్రేషన్ జరుగుతోంది. సుమారు 1,500 మంది కౌలు రైతులను, మరో 1,500 మంది లంక, అటవీ, దేవదాయ భూముల సాగుదారులను ఫార్మర్ ఐడీ కార్డుల రిజిస్ట్రేషన్‌కు అనర్హులుగా గుర్తించారు.

ప్రస్తుతం సొంత భూమి కలిగిన రైతులకు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్రాల్లో సొంత భూమి కలిగిన రైతులకు మాత్రమే ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ ఆధారిత సంక్షేమ పథకాలు అమలు కావాలంటే తప్పనిసరిగా ఐడీ కార్డు నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రధాన మంత్రి కిసాన్ యోజన లబ్ధిదారులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. కౌలు రైతులు, అటవీ భూములు, దేవదాయ శాఖ భూములు సాగుచేసుకునే వారు యూనిక్ ఐడీ కార్డుల ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వ్యవసాయాన్ని నమ్ముకున్న తమకు ఫార్మర్ ఐడీ కార్డులు జారీ చేయకుండా ప్రభుత్వం పక్షపాత వైఖరి అవలంభించిందని విమర్శిస్తున్నారు.

లంక భూములు, కౌలు దారులకు నిరాశ

మండలంలోని లంక, అటవీ, దేవదాయ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ సామాజిక వర్గాల వారు సుమారు 1,500 మందికి యూనిక్ ఐడీ నంబర్ ఇచ్చేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు నిర్దేశించలేదు. ఈ పరిణామాలతో ప్రభుత్వ భూములపై ఆధారపడిన రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లంక, అసైన్డ్ భూములు సాగు చేసుకున్న సుమారు 1,500 మందికి పట్టాలు మంజూరు చేసింది. వీరందరూ సుమారు వందేళ్లుగా భూములను నమ్ముకుని జీవిస్తున్నారు. వీరందరికీ ఫార్మర్ ఐడీ కార్డులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పథకం ప్రయోజనాలు ఇవి..

ఆధార్ కార్డులాగా ప్రతి రైతుకు గుర్తింపు కార్డు ఉండాలని కేంద్ర ప్రభుత్వం నూతన పాలసీ తీసుకొచ్చింది. కార్డు లేకుంటే వ్యవసాయ సీజన్‌లో ప్రభుత్వం అమలు చేసే సబ్సిడీలు, పంటల బీమా, పంట రుణాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ, వ్యవసాయ యంత్ర పరికరాలు, పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వ పథకాల ఫలాలు అందవు.

కౌలుదారులను ప్రభుత్వం గుర్తించాలి



ఫార్మర్ ఐడీ కార్డులు కౌలు రైతులకు కూడా మంజూరు చేయాలి. ఎన్నో ఏళ్లుగా కౌలు భూములను నమ్ముకుని జీవిస్తున్నాం. కౌలు గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇచ్చింది. కౌలు దారులను ప్రభుత్వ రాయితీలకు అర్హులుగా ప్రకటించి ఐడీ కార్డుల రిజిస్ట్రేషన్ చేయాలి.
– షేక్ గాలీసైదా, కౌలు రైతు, దాములూరు

లంక భూముల రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



ఎటువంటి ఆధారం లేకుండా వందేళ్లుగా లంక భూములు సాగు చేసుకుంటున్న వారికి గత ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు ఇస్తున్న ఫార్మర్ ఐడీ కార్డులు లంక సాగుదారులకు కూడా ఇవ్వాలి. రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయాలి. ప్రభుత్వ పథకాలకు అర్హులుగా ప్రకటించాలని కోరుతున్నా.
– పొనుగుమాటి బాపయ్య, రైతు, కొటికలపూడి

క్లుప్తంగా

కక్షసాధింపు చర్యలు గర్హనీయం

నల్లగట్ల స్వామిదాసు

తిరువూరు: వైఎస్సార్ సీపీ నేతలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి అనుసరిస్తోందని, దీనిలో భాగంగానే మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అక్రమంగా అరెస్టు చేశారని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. వంశీని అరెస్టు చేయవద్దని కోర్టు ఆదేశాలున్నా, మరో కేసు బనాయించి అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా కేవలం కక్ష సాధింపుతోనే కూటమి ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని, రాష్ట్రంలో రెడ్ బుక్ పాలనకు వంశీ అక్రమ అరెస్టు ప్రత్యక్ష సాక్ష్యమని విమర్శించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడు కేసు ఉపసంహరించుకున్నట్లు ప్రకటించినా వంశీని అరెస్టు చేయడాన్ని ఖండించారు.

కనుల పండువగా స్వామివార్ల కల్యాణం



మైలవరం: మైలవరం మండలం బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవార్ల కల్యాణం తలంబ్రాలను సంతానం లేని మహిళలు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గురువారం యాదవ రాజులచే జల బిందెల కార్యక్రమం జరిగింది. అనంతరం మేళతాళాలు, సన్నాయి, డప్పులు, కనక తప్పెట్లతో స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల అన్నదానం



ఇబ్రహీంపట్నం: ఫెర్రీలోని ప్రేమ్ నికేతన్ చిల్డ్రన్స్ హోంలోని దివ్యాంగులకు గుడ్ సమరిటన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు గురువారం అన్నదానం చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు చిట్టేలు కోటేశ్వరరావు అధ్యక్షతన దివ్యాంగుల సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు చిట్టేలు శ్రీనివాసరావు, నాగమణి, వేల్పుల రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



నూజివీడు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏపీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ల అసోసియేషన్ డైరీని గురువారం మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తమ పని తీరును మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. టీపీఓ కె.వెంకటేశ్వరరావు, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.300 వేతనం వచ్చేలా పని చేయండి



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): ఉపాధి కూలీలు రోజు వారి వేతనం రూ.300 లభించే విధంగా మట్టి తవ్వకం పనులు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణప్రసాద్ అన్నారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని గోవిందరాజుల చెరువు అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలు పనికి వచ్చి వెంటనే వెళ్లకుండా వెడల్పు రెండున్నర మీటర్లు, అడుగు లోతు, మీటరున్నర పొడవు కొలతల చొప్పున మట్టి తవ్వకం పనులు చేస్తే రోజువారి వేతనం రూ.300 లభిస్తోందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు పనులు చేసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం

అగిరిపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై పోరాడే పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ఆగిరిపల్లిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శివ నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ జహంగీర్ బాషా, సీఐటీయూ నాయకులు నరేష్ పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డుతో ప్రయోజనాలు



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి



కొర్లగుంటలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

చాట్రాయి: రైతు విశిష్ట గుర్తింపు కార్డుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. చాట్రాయి, బూరుగుగూడెం, నరసింహారావుపాలెం, ఆరుగొలనుపేట, జనార్దనవరం, గ్రామాల్లో రైతు విశిష్ట గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రిజిస్ట్రేషన్ అయిన తరువాత వచ్చే గుర్తింపు కార్డు వలన పీఎం కిసాన్, ఎరువులు, విత్తనాలు, మైక్రో ఇరిగేషన్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉద్యానవన పథకాలు వర్తిస్తాయని వివరించారు.

- మైలవరం: భూమి గల ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి ప్రభుత్వం తీసుకువస్తోందని మైలవరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం. శ్రీనివాసరావు అన్నారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం వీఏఏలు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వెల్వడం, మైలవరం గ్రామాల్లో గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి వీఏఏలకు పలు సూచనలు చేశారు.
- ఆగిరిపల్లి: సాగు భూమి ఉన్న ప్రతి రైతూ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని మండల వ్యవసాయాధికారి పల్లగాని చెన్నారావు అన్నారు. చొప్పరమెట్ల రైతు సేవా కేంద్రంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టా పాసు పుస్తకం, ఆధార్‌తో పాటు ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో రైతులు సంప్రదించాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలో 2,200 రైతుల వివరాలను నమోదు చేశారని చెప్పారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.
- ముసునూరు: రైతులు తప్పనిసరిగా ఫార్మర్ విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అబీబ్ బాషా అన్నారు. గురువారం కొర్లగుంట రైతు సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంటలకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రుణ సదుపాయాలు కార్డు ఉంటేనే వర్తిస్తాయని రైతులకు తెలిపారు. నూజివీడు ఏడీఏ విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారి చినసూరిబాబు, వీహెచ్‌ఏలు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఉదయ పొంగళ్లు నివేదన



అమ్మవారికి ఉదయ పొంగళ్లు కార్యక్రమంలో ఈఓ కిశోర్‌కుమార్, ఈఈ రమ, శాలివాహనులు



అమ్మవారి ఒగ్గుకథ చెబుతున్న బైండ్లవారు



ఒత్తులు వెలిగించి ప్రదక్షిణలు చేస్తున్న ఐదు వంశీకులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మూడోరోజు గురువారం అంకమ్మ క్రతువుల్లో భాగంగా శాలివాహనులు ఉదయ పొంగళ్లు చేసి అమ్మవారికి, సహదేవతలకు నివేదించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారికి పాలు పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆచారం ప్రకారం జలబిందెలు మోసినవారు ఇత్తడి తాంబూలాల్లో మూడు ఒత్తులు వెలిగించి ప్రధాన ఆలయంతోపాటు సహ దేవతామూర్తుల ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం బైండ్ల వారితో ఒగ్గు కథ చెప్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్ కుమార్, ఈఈ ఎల్.రమ, ఏఈ రాజు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు తాడేపల్లిలో కుమ్మర్లకు నోటీసులు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఎర్ర చెరువు పక్కన నివసిస్తూ కుండలు తయారు చేసుకుంటున్న కుమ్మర్లను ఖాళీ చేయమని గురువారం గ్రామ పంచాయతీ నోటీసులు జారీ చేసింది. డీఎల్‌పీఓ జారీచేసిన ఆదేశాల మేరకు చెరువు ఆక్రమణదారులకు నోటీసులు అందజేశామని పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ తెలిపారు. 71 కుటుంబాల వారు చెరువును ఆక్రమించుకుని ఉంటున్నారని, వారందరికీ నోటీసులు జారీ చేశామని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువుల ఆక్రమణల తొలగింపునకు నోటీసులు జారీ చేస్తున్నామని డీఎల్‌పీఓ రాఘవన్ తెలిపారు. అయితే గత కొన్నేళ్లుగా చేతి వృత్తి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని కుమ్మర్లు అంటున్నారు. అక్కడ నివసించే కుటుంబాల వారందరికి విజయవాడలో ఇళ్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

ప్రీ స్కూల్ కార్యక్రమాలు మెరుగుపరచాలి

తిరువూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ కార్యక్రమాలు మరింత మెరుగుపరచాలని తిరువూరు సమగ్ర స్త్రీ, శిశు అభివృద్ధి పథకం సీడీపీఓ సత్యవతి అన్నారు. తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం పోషన్ బీ – పదాయ్ బీ కార్యక్రమంలో భాగంగా ప్రీ స్కూల్ కార్యక్రమాల నిర్వహణలో మెలకువలపై మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. తిరువూరు మండలంలోని మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, గంపలగూడెం మండల పరిషత్ స్కూల్, ఎ.కొండూరు మండలం చీమలపాడు జెడ్పీ హైస్కూల్, విస్సన్నపేట మండలం నరసాపురం జెడ్పీ పాఠశాలల్లో శిక్షణా తరగతులు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ బండి చంటి మృతి



మైలవరం: మైలవరం గ్రామ ప్రముఖులు, మాజీ ఉప సర్పంచ్ బండి సత్యనారాయణ (చంటి) గురువారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. చంటికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పలువురు ప్రముఖులు, గ్రామస్తులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. కళాశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉచిత శిక్షణకు ఈ నెల 20 వరకు గడువు పొడిగించామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఈ మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో కళాశాల పని వేళల్లో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు సెల్: 82477 66718 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో జెడ్పీ విద్యార్థినుల ప్రతిభ



ముసునూరు: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థినులు సత్తా చాటారని హెచ్‌ఎం పీవీఎస్ రామకృష్ణారావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 12 వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో అండర్–16 విభాగంలో పాల్గొన్న రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు నాగ సుధ, భార్గవి అసమాన ప్రతిభతో ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించిందని చెప్పారు. విద్యార్థినులకు, శిక్షణ ఇచ్చిన పీడీ డాక్టర్ వాకా నాగరాజుకు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

10 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో ఎక్సైజ్ సిబ్బంది గురువారం దాడులు చేశారు. గ్రామానికి చెందిన కె.సురేష్ వద్ద ఐదు లీటర్లు, కందుల ప్రభాకర్ వద్ద ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు.

17 ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

తిరువూరు: గంపలగూడెం మండలంలో కట్టెలేరు నుంచి ఇసుక అక్రమంగా తోలుతున్న 17 ట్రాక్టర్లను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వినగడప, కనుమూరు గ్రామాల్లో కట్టెలేరు నుంచి ఉచిత ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నాయని కొద్ది నెలలుగా యథేచ్ఛగా తవ్వకాలు జరిపిన పలువురు ట్రాక్టర్ల యజమానులు ఇసుకను ట్రక్కు రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయాలు జరుపుతున్నట్లు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదులు అందాయి. గ్రామ సచివాలయం నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా, ట్రాక్టర్లకు ఉచిత ఇసుక బ్యానరు ఏర్పాటు చేయకుండా తోలకాలు జరపడంపై కూడా అధికారులు విచారణ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు గ్రామాలకు ఇసుక పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

మహా శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



కొండపర్వ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

విస్సన్నపేట: కొండపర్వ అమరాంబికా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పర్వదిన వేడుకల ఏర్పాట్లపై విస్సన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు లక్ష్మీకల్యాణి అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. సమావేశంలో తిరువూరు సీఐ గిరిబాబు, విస్సన్నపేట ఎస్ఐ రామకృష్ణ, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, సర్పంచి రమేష్‌బాబు, ఆలయ చైర్మన్ నరసింహారావు, గ్రామ ప్రముఖులు మట్టా వేణుగోపాల్ పాల్గొన్నారు. అనంతరం కొండపర్వ ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు గురువారం పరిశీలించారు.

వైభవంగా వేంకటాచల స్వామి కల్యాణం



తిరువూరు వేంకటాచలస్వామి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తిరువూరు: పాత తిరువూరులోని వేంకటాచల స్వామి తిరుకల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని కల్యాణ మండపంలో వేద పండితుల మంత్రోచ్చరణలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. ఆలయ అర్చకులు దేవయజనం వేణుగోపాలకృష్ణమాచార్యులు, దివి ఉదయ కుమారాచార్యులు, విఠలాచార్యులు, సత్యనారాయణాచార్యులు, పార్థసారథాచార్యులు వివాహ క్రతువు నిర్వహించారు. ఆలయ మేనేజరు ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన కల్యాణోత్సవాన్ని భక్తులు అధికసంఖ్యలో వీక్షించారు. తిరువూరు సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ సత్యనారాయణ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం రామచంద్రాపురం, తెల్లదేవరపల్లి తండాల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి 10 లీటర్ల సారా, 13 కిలోల నల్ల బెల్లం, కిలో పటిక స్వాధీనం చేసుకున్నారు. 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎలియాజర్, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జి.కొండూరు: కుంటముక్కల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థినులకు ఏప్రిల్ 6న పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

గుడిపాడు పాఠశాల ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ సుబ్బారావు

ముసునూరు: పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. గుళ్లపూడి శివారు గుడిపాడు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఓర్పు, క్రమశిక్షణ, పట్టుదలతో చదివి విద్యార్థులు విజయం సాధించాలని సూచించారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డులను తనిఖీ చేసి, పిల్లలతో కలిసి భోజనం చేశారు. హెచ్‌ఎం నిర్మలాదేవి, ఉపాధ్యాయులు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ

ఇబ్రహీంపట్నం: గంగానమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం స్థానిక తూర్పు ఇబ్రహీంపట్నంలో గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో గ్రామోత్సవం జరిపారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. పలువురు మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

మొర్సుమల్లి హత్య కేసు మిస్టరీ వీడినట్లేనా?

సాక్షి టాస్క్‌ఫోర్స్: మైలవరం మండలం మొర్సుమల్లి శివారు ములకలపెంట గ్రామం మామిడి తోటలో ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన రైతు కేసు ఒక కొలిక్కి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. కుటుంబ సభ్యుల్లో ఒకరు కడియం శ్రీనివాసరావు హత్యలో సూత్రధారిగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆస్తి వ్యవహారాల్లో భేదాభిప్రాయాలే హత్యకు కారణంగా ప్రచారం జరుగుతోంది. ములకలపెంట గ్రామానికి చెందిన కడియం శ్రీనివాసరావు శనివారం అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. శ్రీనివాసరావు కుమారుడు కడియం పుల్లారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు శ్రీనివాసరావుకు, పక్కనే ఉన్న మరో రైతుకు సరిహద్దు తగాదాలు ఉండటంతో మృతుని బంధువులు అందరూ సరిహద్దు రైతును అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. విజయవాడ నుంచి డాగ్‌స్క్వాడ్ క్లూస్ టీమ్‌లు ఏసీపీ ప్రసాదరావు ఆధ్వర్యంలో సీఐ దాడి చంద్రశేఖర్, ఎస్ఐ సుధాకర్, పోలీస్ సిబ్బంది పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మొరుసుమల్లి, ములకలపెంట, తెలంగాణ రాష్ట్రం మధిర నియోజకవర్గం ఎర్రుబాలెం మండలంలోని సత్యనారాయణపురం గ్రామాలకు చెందిన పలువురిని తీసుకు వచ్చి తమదైన శైలిలో పోలీసులు విచారణ చేపట్టారు. ఐదు రోజుల్లోనే హత్య కేసులో పురోగతి కనిపించినట్లు విశ్వసనీయ సమాచారం. మరో రెండు, మూడు రోజుల్లో పోలీసులు పూర్తి వివరాలు వెల్లడిస్తారని సమాచారం.